

సోమశిలలో 9.860 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో మంగళవారానికి 9.860 టీఎంసీల నీరు ఉంది. పైతట్టు నుంచి 55 క్యూసెక్కుల వరద ప్రవాహం వస్తోంది. దిగువకు 210 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.76,280
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.6,813
మూడు శాతం జీఎస్టీతో	రూ.7,017
నవర (8 గ్రాములు)	రూ.56,136

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 35.0 /28.0

జిల్లాలో బుధవారం ఆకాశం పాక్షికంగా మేఘావృతంగా ఉంటుంది. పగటి వాతావరణం వేడిగా ఉండనుంది. వాతావరణంలో తేమ 61 శాతం ఉంది.

న్యూస్‌రీల్

పొగాకు విత్తనాలు సిద్ధం

మర్రిపాడు: 2024–25 పంట కాలానికి సంబంధించి పొగాకు విత్తనాలు అవసరమైన రైతులకు సరఫరా చేయడానికి సిద్ధంగా ఉన్నాయని డీసీపల్లి పొగాకు బోర్డు వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. సొంత నారుమడి పెట్టుకునే రైతులకు సీటీఆర్ఐ రాజమండ్రి, కమర్షియల్ నారుమడి కోసం సీటీఆర్ కందుకూరులో పొగాకు విత్తనాలను సరఫరా చేస్తున్నట్లు పేర్కొన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సొంతగా నారుమడి తయారు చేసే రైతులకు ఒక బ్యారన్‌కు 500 గ్రాములు రూ.600 చొప్పున, కమర్షియల్ నారుమడికి కిలో రూ.1,800 విక్రయిస్తున్నట్లు తెలిపారు. కమర్షియల్ నారుమడికి సంబంధించి ఒక ఎకరానికి రూ.200 చొప్పున డీసీపల్లి పొగాకు బోర్డులో ఫీజు చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకుని రసీదు పొందాలన్నారు. సొంత నారుమడి రైతులు పొగాకు బోర్డు పాస్‌బుక్, కమర్షియల్ నారుమడి విత్తనాలకు రిజిస్ట్రేషన్‌కు చెల్లించిన రసీదు తీసుకెళ్లాలన్నారు. విత్తన విక్రయ లావాదేవీలు నగదు రహితంగా ఫోన్‌పే, గూగుల్‌పే ద్వారా చెల్లించాల్సి ఉంటుందన్నారు.

ఉపాధ్యాయ అవార్డులకు నమోదు గడువు పొడిగింపు

నెల్లూరు (టౌన్): జాతీయ ఉపాధ్యాయ అవార్డుల కోసం వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకునేందుకు ఈ నెల 18వ తేదీ వరకు గడువు పెంచినట్లు డీఈఓ పీవీజే రామారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో జిల్లా, రాష్ట్ర స్థాయి అవార్డులు పొందిన ఉపాధ్యాయులు సైతం జాతీయ ఉపాధ్యాయ అవార్డులకు నమోదు చేసుకోవచ్చన్నారు. పల్లిపాడు జిల్లా విద్యాశిక్షణా సంస్థ ప్రిన్సిపల్, ఉప విద్యాశాఖాధికారులు, ఎంఈఓలు అవార్డులకు సంబంధించి ప్రతి మండలం నుంచి కనీసం ఒక ఉపాధ్యాయుడు వెబ్‌సైట్ ద్వారా వివరాలు సమర్పించాలన్నారు.

ముత్తుకూరులో మహిళకు డెంగీ



మురుగు గుంతల్లో మందు పిచికారీ

ముత్తుకూరు: ముత్తుకూరు కోనేటిమిట్ట ప్రాంతానికి చెందిన ఓ మహిళ డెంగీ బారిన పడడం స్థానికంగా కలకలం రేపింది. మంగళవారం వైద్య ఆరోగ్యశాఖ అధికారులు హుటాహుటిన ఆ ప్రాంతంలో పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు చేపట్టారు. అడపాదడపా కురుస్తున్న వర్షాలకు పల్లపు ప్రాంతాల్లో నీరు నిల్వ చేరడంతో పాటు మురుగు కాలువను శుభ్రం చేయకపోవడంతో దోమల వ్యాప్తి అధికమైంది. సీజనల్ వ్యాధులు ప్రబలుతాయని తెలిసినా సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో డెంగీ కేసులు ప్రబలుతున్నాయి. డెంగీ కేసు నమోదు కావడంతో అప్రమత్తం అయిన మండల వైద్యాధికారి దేవీకృప, సబ్‌యూనిట్ ఆఫీసర్ సుధాకర్‌రెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్ కృష్ణంరాజు తదితరులు కోనేటి మిట్ట ప్రాంతంలో పర్యటించారు. మురుగు గుంతల్లో పైరిత్రిమ్ మందు ద్రావకాన్ని పిచికారీ చేయించారు. అనంతరం వైద్య సిబ్బంది జ్వరాల వ్యాప్తిపై సర్వే నిర్వహించారు. పీహెచ్ఎన్ వేళాంగణి, హెల్త్ అసిస్టెంట్ బాలకృష్ణ పాల్గొన్నారు.

వంద దాటిన టమోటా

- మళ్లీ ఘాటెక్కుతున్న ఉల్లిపాయ



నెల్లూరు (వీఆర్సీసెంటర్): టమాటా, ఉల్లి పాయలు, కూరగాయల ధరలు రోజు రోజుకూ పెరిగి పోతున్నాయి. సామాన్యుడు కొనలేని విధంగా ధరలు ఎగబాకుతున్నాయి. వీటితో పాటు పప్పు ధాన్యాల ధరలు కూడా పెరిగిపోవడంతో సామాన్య, మధ్య తరగతి ప్రజలు ఉసూరుమంటున్నారు. మార్కెట్‌లో మంగళవారం టమోటా ధర కిలో రూ.100 పెరిగింది. ఉల్లిపాయ రూ.50కు చేరింది. అయితే ఈ ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి.

ఈ నగరానికి ఏమైంది..!

నెల్లూరు నగర ప్రజల ఆరోగ్యానికి ఆపద ముంచుకొస్తోంది. ఒక పక్క ఎక్కడికక్కడ పేరుకుపోతున్న చెత్తాచెదారాలు, మరో పక్క కాలువల్లో ముందుకు కదలని మురుగునీరు, రోడ్లపై నిల్వ చేరుతున్న డ్రెయినేజీతో నగరం దుర్గంధంగా మారింది. పారిశుద్ధ్య చర్యలు పడకేయడంతో నీరు, గాలి కలుషితమై డయేరియా, దోమల ఉత్పత్తి పెరిగి మలేరియా, డెంగీ, చికున్‌గున్యా వంటి సీజనల్ వ్యాధులతో ప్రజల ప్రాణాలకే ముప్పుగా పరిణమిస్తోంది. పారిశుద్ధ్య పర్యవేక్షణ బాధ్యతను అధికార యంత్రాంగం గాలికొదిలేసినట్లు కనిపిస్తోంది. గత ప్రభుత్వ హయాంలో పారిశుద్ధ్య సిబ్బంది వాహనాలతో ఇంటింటికి వచ్చిన చెత్త సేకరించారు. కొత్త ప్రభుత్వం కొలువుదీరాక ఈ ప్రక్రియకు మంగళం పాడేశారు.

- పడకేసిన పారిశుద్ధ్య చర్యలు
- పూడిక తీయక కాలువల్లో నిలిచిన మురుగునీరు
- చెత్తా చెదారంతో నిండిపోయిన డ్రెయినేజీలు
- మురుగు ప్రవహించే దారి లేక రోడ్లపై పారుతున్న వైనం
- విజృంభిస్తున్న ప్రాణాంతక డయేరియా, మలేరియా, డెంగీ
- చర్యలు చేపట్టకుంటే ప్రాణాలకే ముప్పు





నజీర్‌తోట ప్రాంతంలో ఇళ్ల మధ్య నిల్వ చేరిన మురుగునీరు

మొక్కుబడిగా పర్యవేక్షణ

దాదాపు 8 లక్షలకు పైగా జనాభా ఉన్న నెల్లూరు నగర పాలక సంస్థ పరిధిలో మొత్తం 54 డివిజన్లు ఉండగా 167 సచివాలయాలున్నాయి. 150 కి.మీ. మేర విస్తీర్ణం ఉన్న నగరంలో 1,83,643 గృహాలున్నాయి. చెత్త సేకరణకు 146 వాహనాలున్నాయి. వీధులు, కాలువలు శుభ్రం చేసేందుకు 1,506 మంది పారిశుద్ధ్య కార్మికులు, పర్యవేక్షణకు ఆరుగురు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, ఏడుగురు హెల్త్ అసిస్టెంట్లు, 131 మంది వార్డు శానిటేషన్ అండ్ ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీలు, 26 మంది పబ్లిక్ హెల్త్ మేస్త్రీలు ఉన్నారు. గత ప్రభుత్వ హయాంలో తడి, పొడి చెత్త సేకరణకు ప్రత్యేకంగా డస్ట్‌బిన్లు ప్రతి ఇంటికీ అందజేసింది. తడి, పొడి చెత్త తరలించే విధంగా ప్రత్యేకంగా వాహనాలను రూపొందించింది. ఆయా వాహనాలతో పారిశుద్ధ్య సిబ్బంది నిత్యం ఇంటింటి నుంచి తడి, పొడి చెత్త సేకరిస్తూ డంపింగ్ యార్డుకు తరలించారు. మరో వైపు రోడ్లు ఊడుస్తూ కాలువలను శుభ్రం చేశారు. నగరంలో పారిశుద్ధ్య పర్యవేక్షణకు నగరపాలక సంస్థలో మానిటరింగ్ విభాగాన్ని ఏర్పాటు చేసి, కాల్ సెంటర్‌ను, సోషల్ మీడియా ద్వారా ఫిర్యాదులను స్వీకరిస్తూ ఎప్పటికప్పుడు ఎక్కడికక్కడ పారిశుద్ధ్య చర్యలు చేపట్టింది. తాజాగా సార్వత్రిక ఎన్నికల నుంచి పారిశుద్ధ్యంపై పర్యవేక్షణ కొరవడింది. కొత్త ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత ప్రజారోగ్యం కంటే.. ప్రభుత్వ వ్యవస్థల్లో పెత్తనానికి ప్రాధాన్యత ఇస్తోంది. రౌతు మెత్తన అయితే.. గుర్రం మూడు కాళ్లపై పరుగులు తీస్తుందనే చందాన పారిశుద్ధ్య వ్యవస్థ పరిస్థితి ఉంది.



కస్తూరిదేవి స్కూల్ ముందు మురుగు కాలువలో పిచ్చిమొక్కలు మొలచి, చెత్తాచెదారం నిండిపోవడంతో ముందుకు కదలని మురుగునీరు

నెల్లూరు (బారకాసు): ప్రపంచాన్నే వణికించిన కరోనాను గత ప్రభుత్వం ప్రణాళికాత్మకంగా కట్టడి చేయగలిగితే.. ప్రస్తుత ప్రభుత్వం కనీసం సీజనల్ వ్యాధులను కట్టడి చేయలేక చేతులెత్తేసింది. ఇటీవల కాలంలో అడపాదడపా కురుస్తున్న వర్షాలతో నెల్లూరు నగరంలో పారిశుద్ధ్యం పూర్తిగా క్షీణించింది. ఇప్పటికే నెల్లూరుతో పాటు ఉమ్మడి జిల్లాలో పలు చోట్ల డయేరియా, మలేరియా ప్రబలింది. డయేరియాతో పలువురు ప్రాణాలు కోల్పోయారంటే ఈ ప్రభుత్వం, అధికార యంత్రాంగం పనితీరుకు అద్దం పడుతోంది. ప్రజారోగ్య పరిరక్షణ కంటే.. ఈ ప్రభుత్వానికి వేరే ప్రాధాన్యతలు కనిపిస్తున్నాయి. ప్రబలుతున్న సీజన్ వ్యాధుల నియంత్రణకు అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేస్తూ, చర్యలు చేపట్టాల్సిన ఈ ప్రభుత్వం శ్వేతపత్రాల ప్రజెంటేషన్‌తో ప్రజారోగ్యాన్ని గాలికొదిలేసింది.



గాంధీబొమ్మ సెంటర్‌లో దుకాణాల ముందు కాలువ పొంగి రోడ్డుపై చేరిన మురుగు నీరు

నెల్లూరు నగరంలో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా తయారైంది. నగరంలో డ్రెయినేజీ కాలువల్లో చెత్తాచెదారం, బురద (సిల్ట్) పేరుకుపోయింది. దీంతో మురుగు నీరు పారుదల లేక రోడ్లపైకి ప్రవహిస్తోంది. దీనికి తోడు అడపాదడపా కురుస్తున్న వర్షపు నీటితో కలిసి రోడ్లపై బురద చేరి దుర్గంధం వెదజల్లుతోంది. కొన్ని ప్రాంతాల్లో ఇళ్ల మధ్యనే రోడ్లపై మురుగు నీరు నిలబడడంతో దోమల ఉత్పత్తికి ఆవాసాలుగా మారుతున్నాయి. మరో వైపు కొన్ని ప్రాంతాల్లో చెత్తను తొలగించకపోవడంతో దోమలు ప్రబలి డెంగీ, చికున్‌గున్యా, మలేరియా, టైఫాయిడ్ జ్వరాల బారిన పడుతున్నారు.

చర్యలు చేపట్టకుంటే పరిస్థితి ఆందోళనకరమే

నగరంలోని 54 డివిజన్లలో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారడంతో నగర ప్రజలు అనారోగ్యంతో విలవిలలాడుతున్నారు. ఇప్పటికే మలేరియా, డెంగీ, టైఫాయిడ్ వంటి విషజ్వరాల బారిన పడి పలు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. మురుగు కాలువలు కుచించుకుపోవడంతో పూడిక తీత పనులు చేపట్టకపోతే పరిస్థితి ఆందోళనకరంగా మారే ప్రమాదం ఉంది. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో కాలువలు పూడిపోయి చెత్తా, చెదారం చేరి నీరు ప్రవహించే దారి లేక మురుగు నిల్వ చేరింది. మరి కొన్ని ప్రాంతాల్లో కాలువల నిర్మాణాలు లేకపోవడంతో మురుగు నీరు వీధుల్లోకి చేరుతోంది. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో ఆయా కాలువల్లో నీరు నిల్వ చేరి రోడ్లపైకి, నివాసాల్లోకి ప్రవహించే పరిస్థితి ఏర్పడనుంది. దీంతో ఆయా వీధుల్లో స్థానిక ప్రజలు కాలినడకన వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు



మురుగు కాలువలు శుభ్రం చేయడం లేదు. రోజుల తరబడి డ్రైనేజీలో పేరుకుపోయిన చెత్త తొలగించడం లేదు. ప్రస్తుతం కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం పారిశుద్ధ్య సమస్యను పట్టించుకోకపోవడంతో నగరంలోని పలు ప్రాంతాల ప్రజలు తీవ్ర అనారోగ్యాలకు గురవుతున్నారు.

– సుబ్బారెడ్డి, సత్యనారాయణపురం, నెల్లూరు నగరం

పారిశుద్ధ్య పనులపై నిర్లక్ష్యం



నగరంలోని మైపాడురోడ్డులో ఉన్న పలు ప్రాంతాల్లో మురుగు కాలువలను శుభ్రం చేయకపోవడం వల్ల మురుగు నీరు నిల్వ చేరుతోంది. పారిశుద్ధ్యం మెరుగు పరచడం వంటి పనులపై సంబంధిత అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు.

– రమణారెడ్డి, మైపాడురోడ్డు, నెల్లూరు నగరం

అంటురోగాలు ప్రబలే అవకాశం



మురుగు, పంట కాలువల్లో పేరుకుపోయిన చెత్తను ఎస్ఎంసీ సిబ్బంది ఎప్పటికప్పుడు తొలగించకపోవడంతో మురుగు పేరుకుపోతుంది. దీంతో దోమలు అధికమై నగర ప్రజలు ఇప్పటికే పలువురు విషజ్వరాల బారిన పడి పలు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు.

– ధనూజ, నజీర్‌తోట, నెల్లూరు నగరం

అస్తవ్యస్తంగా డ్రెయినేజీ సమస్య



నెల్లూరు నగరంలో డ్రెయినేజీ సమస్య అస్తవ్యస్తంగా ఉంది. పలు వీధుల్లోని మురుగు కాలువల్లో నీరు ప్రవహించక మురుగు పేరుకుపోతుంది. మురుగు వీధుల్లోకి ప్రవహిస్తోంది. దీంతో ఆయా ప్రాంత ప్రజలు దర్గంధం భరించలేకపోతున్నారు. గతంలో ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు.

– బ్రహ్మయ్య, నవాబుపేట, నెల్లూరు నగరం

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాం



నెల్లూరు నగరంలోని 54 డివిజన్లలో పారిశుద్ధ్యం మెరుగు పరిచేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాం. ఇప్పటికే అనేక ప్రాంతాల్లోని మురుగు కాలువల్లో పేరుకుపోయిన మురుగును తొలగించాం. కాలువల్లోని సిల్ట్‌ను, వ్యర్థాలను తొలగించి నీరు ప్రవహించేలా చర్యలు చేపట్టాం. పూడిపోయిన పంట కాలువలను శుభ్రం చేసే పనులు ఇంజనీరింగ్ విభాగాధికారులు చూస్తుంటారు.

– డాక్టర్ వెంకటరమణ, హెల్త్ ఆఫీసర్, నగర పాలక సంస్థ, నెల్లూరు

రొట్టెల పండగొచ్చింది

మతసామరస్యానికి ప్రతీకగా జరిగే రొట్టెల పండగ పటిష్ట ఏర్పాట్ల మధ్య బుధవారం నుంచి ప్రారంభం కానుంది. ఐదు రోజుల పాటు జరిగే ఈ పండగకు సింహపురి దారులన్నీ బారాషహీద్ దర్గా వైపే మళ్లాయి. కోర్కెలు తీరిన భక్తులు రొట్టెలు వదిలేందుకు, కొత్త కోర్కెల రొట్టెలు పట్టుకునేందుకు ముందు రోజు నుంచే పోటెత్తడంతో దర్గా ప్రాంగణం కిటకిటలాడుతోంది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులే కాకుండా కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర, తెలంగాణ ప్రాంతాల నుంచి భక్తులు రావడంతో స్వర్ణాల చెరువు భక్తజనసంద్రంగా మారింది. ఐదు రోజుల పాటు నిర్వహించే రొట్టెల పండుగలో భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు తలెత్తకుండా యంత్రాంగం పటిష్ట చర్యలు చేపట్టింది.



షహీదులను దర్శించుకుంటున్న భక్తులు

పండగ ఐదురోజులు..

నెల్లూరు (బృందావనం): మతసామరస్యానికి ప్రతీకగా, భక్తివిశ్వాసాలకు నమ్మికగా, మదిలోని ఈడేరే కోరికలను తీర్చే కోటి ఆశల పండగ రొట్టెల పండగ. ఐదు రోజుల పాటు బారాషహీద్ దర్గాలో జరగనున్నాయి.

బుధవారం – షహదత్, సందల్‌మాలి
గురువారం – గంధమహోత్సవం
శుక్రవారం – రొట్టెల పండగ
శనివారం – తహలీల్ ఫాతెహా
ఆదివారం – రొట్టెల పండగ ముగింపు

- నేటి నుంచి ఐదు రోజుల పాటు సందడి
- కళకళలాడుతున్న దర్గా ప్రాంగణం
- రెండు రోజుల ముందు నుంచే భక్తుల తాకిడి
- ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న అధికారులు

నెల్లూరు (బారకాసు): నెల్లూరుకు రొట్టెల పండగొచ్చింది. నగరంలోని దర్గామిట్టలో ఉన్న బారాషహీద్ దర్గాలో రొట్టెల పండగకు అవసరమైన ఏర్పాట్లన్నీ అధికారులు సర్వం సిద్ధం చేశారు. బుధవారం నుంచి ప్రారంభమయ్యే ఈ రొట్టెల పండగ ఐదు రోజుల పాటు నిర్వహించనున్నారు. ఏటా మోహరం తర్వాత నెలవంక కనిపించిన 11వ రోజు బారాషహీద్ దర్గాను సందర్శించి కోర్కెల రొట్టెల మార్పిడి చేసుకోవడం ఆనవాయితీగా వస్తోంది. కులమతాలకు అతీతంగా మతసామరస్యాలకు ప్రతీకగా ఈ పండగ జరగడం విశేషం. జిల్లా, రాష్ట్రంతో పాటు దేశ, విదేశాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వస్తారు.

ముందస్తుగానే రొట్టెల పండగ

ఏటా జరిగే రొట్టెల పండగకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొంటారు. భక్తుల తాకిడి ఎక్కువవుతోందని ఈ ఏడాది మూడు రోజుల ముందు నుంచే అనేక మంది భక్తులు బారాషహీద్ దర్గాకు వచ్చి ప్రార్థనలు చేసుకుని స్వర్ణాల చెరువులో రొట్టెలు మార్చుకుని తమ మొక్కులను చెల్లించుకుని వెళ్తున్నారు. దీంతో దర్గా ప్రాంగణం కళకళలాడుతోంది.

సకల సౌకర్యాలు సిద్ధం

నగర పాలక సంస్థ, పోలీసు, విద్యుత్, వైద్యశాఖతో పాటు ఇతర శాఖల అధికారులు సమన్వయంతో దాదాపు ఏర్పాట్లన్నీ పూర్తి చేశారు. దర్గాకు గత మూడు రోజులుగా వందలాది మంది మంది భక్తులు హాజరయ్యారు. పండగ ఐదు రోజుల్లో లక్షల మంది హాజరయ్యే అవకాశం ఉంది. తాగునీటి కేంద్రాలు, స్నానపు గదులు, మరుగుదొడ్లు మహిళలు, పురుషులకు వేర్వేరుగా ఏర్పాటు చేశారు. అత్యవసర పరిస్థితుల నేపథ్యంలో 108 వాహనాలు సిద్ధంగా ఉంచారు. ప్రాథమికంగా వైద్య సేవలు అందించేందుకు ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు చేశారు. భక్తులు విశ్రాంతి తీసుకునేందుకు జింక్ షీట్లలో షెడ్లు ఏర్పాటు చేశారు.

21న జిల్లా సాఫ్ట్‌బాల్ జట్ల ఎంపికలు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 21న స్థానిక ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో జిల్లా స్థాయి సీనియర్స్ స్త్రీ, పురుషుల జట్ల ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మలిరెడ్డి కోటారెడ్డి, సీహెచ్ కామేశ్వరి మంగళవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఎంపికైన జట్లు ఆగస్టు 10వ తేదీ నుంచి పుత్తూరులో జరిగే 11వ రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహిస్తాయన్నారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు నాలుగు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, ఒరిజనల్ సర్టిఫికెట్లు, ఆధార్ కార్డుతో 21వ తేదీ ఉదయం 9 గంటలకు హాజరు కావాలని కోరారు. 97036 54315, 807429 9640లో సంప్రదించగలరు.

పండగకు భారీ భద్రత

- రెండు వేల మందితో బందోబస్తు
- అప్రమత్తంగా విధులు నిర్వహించాలి
- ఎస్పీ కృష్ణకాంత్

నెల్లూరు (క్రైమ్): బారాషహీద్ దర్గాలో ఐదు రోజుల పాటు జరిగే రొట్టెల పండగకు పోలీసు శాఖ భారీ భద్రతా ఏర్పాట్లు చేస్తోంది. దేశ, విదేశాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరానుండడంతో భక్తుల భద్రతకు ఎస్పీ జి.కృష్ణకాంత్ పటిష్ట భద్రతా చర్యలు చేపట్టారు. జిల్లాతో పాటు గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాలకు చెందిన 2 వేల మంది సిబ్బంది బందోబస్తు విధుల్లో పాల్గొంటున్నారు. అందులో ఎస్పీ, ముగ్గురు ఏఎస్పీలు, 10 మంది డీఎస్పీలు, 48 మంది సీఐలు, 127 మంది ఎస్ఐలు, 278 ఏఎస్ఐ/హెచ్‌సీలు, 832 మంది కానిస్టేబుల్స్, 96 మంది ఉమెన్ కానిస్టేబుల్స్, 282మంది హోమ్‌గార్డులు, 49 మంది మహిళా హోంగార్డులు, 276 మంది ఏఆర్, స్పెషల్ పార్టీ పోలీసు సిబ్బంది ఉన్నారు.

అవుట్‌పోస్టు ఏర్పాటు

భక్తుల సౌకర్యార్థం దర్గా ఆవరణలో 24 గంటల పాటు పనిచేసే విధంగా పోలీసు అవుట్‌పోస్టును ఏర్పాటు చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలిగినా ఔట్‌పోస్టులోని సిబ్బందికి తెలియజేస్తే తగిన చర్యలు తీసుకోనున్నారు. నేరాలు జరగకుండా దర్గా ఆవరణ మొత్తం కవరయ్యేలా 52 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. వాటిని అవుట్‌పోస్టులోని కమాండ్ కంట్రోల్ సిస్టమ్‌కు, జిల్లా పోలీసు కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్‌కు అనుసంధానం చేశారు. సాంకేతిక పరిజ్ఞానంపై పూర్తి పట్టున్న సిబ్బంది 24 గంటల పాటు కమాండ్ కంట్రోల్ రూమ్‌లో ఉంటూ ప్రతి ప్రాంతాన్ని క్షుణ్ణంగా పరిశీలించనున్నారు.



సిబ్బందికి దిశానిర్దేశం చేస్తున్న ఎస్పీ కృష్ణకాంత్



హాజరైన పోలీస్ సిబ్బంది

అప్రమత్తంగా విధులు నిర్వహించాలి

పండగ నేపథ్యంలో అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసు అధికారులు అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఎస్పీ డాక్టర్ జి. కృష్ణకాంత్ ఆదేశించారు. మంగళవారం పోలీసు కవాతు మైదానంలో బందోబస్తు విధులకు హాజరైన సిబ్బందికి ఆయన దిశానిర్దేశం చేశారు. పండగలో గంధమహోత్సవం, మరుసటి రోజు ప్రధానమని, ఆ రోజుల్లో పెద్ద సంఖ్యలో భక్తులు దర్గాను దర్శించుకుంటారన్నారు. దర్గా ప్రవేశ ద్వారం, వెలుపలి ద్వారాల వద్ద భక్తులకు ఇబ్బందులు కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. స్వర్ణాల ఘాట్ వద్ద రొట్టెలు పట్టుకునే సమయంలో భక్తులను అప్రమత్తం చేస్తూ ఉండాలన్నారు. పరిమితికి మించి, లైఫ్ జాకెట్లు లేకుండా బోటు షికారుకు అనుమతించరాదన్నారు. అందరూ మ్యాన్‌ప్యాక్స్, పబ్లిక్ అడ్రస్సింగ్ సిస్టమ్‌ను ఉపయోగించి కమ్యూనికేషన్ గ్యాప్ లేకుండా చూడాలన్నారు. క్రైమ్ పార్టీ సిబ్బంది మఫ్టీలో విధులు నిర్వహిస్తూ నేరాలు జరగకుండా చూడాలన్నారు. బాంబ్, డాగ్ స్క్వాడ్‌లు నిరంతర తనిఖీలు నిర్వహించాలన్నారు. ట్రాఫిక్‌కు ఎక్కడా అంతరాయం రాకుండా చూడాలన్నారు. జిల్లా అధికారులందరూ ఇతర జిల్లాల నుంచి బందోబస్తు విధులకు హాజరైన సిబ్బందిని ఇతర శాఖలను సమన్వయం చేసుకుంటూ పండగ ప్రశాంత వాతావరణంలో జరిగేలా చూడాలన్నారు. విధుల్లో అలసత్వం ప్రదర్శించినా, బందోబస్తు విధులకు గైర్హాజరైనా శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట ఏఎస్పీలు సీహెచ్ సౌజన్య, ప్రసాద్, శ్రీనివాసరావు, డీఎస్పీలు ఉన్నారు.

అధికార పార్టీ అండతో బరితెగింపు

- ఉదయగిరిలో యథేచ్ఛగా మట్టి తరలింపు



పెద్ద చెరువు నుంచి మట్టిని తీసుకెళ్తున్న ట్రాక్టర్

ఉదయగిరి: అధికార పార్టీ అండతో కొందరు రెచ్చిపోతున్నారు. పలువురు ఇటుక బట్టీల యజమానులు స్థానిక టీడీపీ నేతల సహకారంతో ఉదయగిరి పెద్ద చెరువు, చిన్న చెరువుల్లో జేసీబీతో తవ్వకాలు చేయించి పది ట్రాక్టర్ల ద్వారా అక్రమంగా మట్టి తరలింపును మంగళవారం ప్రారంభించారు. అనుమతి లేకుండా జరుగుతున్న మట్టి రవాణాను ఇరిగేషన్ అధికారులు కొంతసేపు అడ్డుకున్నా నేతల ఒత్తిడితో చేతులెత్తేసినట్లు తెలుస్తోంది. ఈ విషయమై ఇరిగేషన్ డీఈ చంద్రమౌళిని వివరణ కోరగా అనుమతి లేకుండా చెరువుల్లో మట్టి తవ్వి తరలిస్తే వాహనాలు సీజ్ చేసి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. పలుమార్లు రవాణాదారులను హెచ్చరించినా వారిలో మార్పు రాలేదన్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు.

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి	రూ.55
సన్నవి	రూ.38
పండ్లు	రూ.28

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్)	: 128
లేయర్ (లైవ్)	: 110
బ్రాయిలర్ చికెన్	: 230
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 258
లేయర్ చికెన్	: 187

నేటి నుంచి ట్రాఫిక్ ఆంక్షలు

- రొట్టెల పండగ నేపథ్యంలో వాహనాల మళ్లింపు
- విధుల్లో 580 మంది ట్రాఫిక్ సిబ్బంది
- పాసులకు నోచుకోని స్థానికులు

నెల్లూరు(క్రైమ్): నెల్లూరులోని బారాషహీద్ దర్గాలో ఈనెల 17 నుంచి 21వ తేదీ వరకు రొట్టెల పండగ జరుగుతుంది. దీనికి దేశ, విదేశాల నుంచి భక్తులు విచ్చేస్తారు. ఈ నేపథ్యంలో నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. ఎస్పీ జి.కృష్ణకాంత్ పర్యవేక్షణలో 580 మంది సిబ్బంది మూడు షిఫ్టుల్లో ట్రాఫిక్ విధులు నిర్వహించనున్నారు.

మళ్లింపు ఇలా..

బుధవారం ఉదయం 7 గంటల నుంచి ట్రాఫిక్ డైవర్షన్లను అమలు చేయనున్నారు. రెగ్యులర్ వాహనాలను దారి మళ్లించారు.

- చెన్నై, బెంగళూరు, తిరుపతి, గూడూరు వైపు నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులను అయ్యప్పగుడి ఫ్లై ఓవర్, బీవీ నగర్, అన్నమయ్య సర్కిల్, ఆర్ఎస్‌పురం, రైల్వే అండర్ బ్రిడ్జి, ఏసీ మార్కెట్ మీదుగా ఆర్టీసీ బస్టాండ్‌కు దారి మళ్లించారు.
- పొదలకూరు వైపు నుంచి వచ్చే బస్సులు డైకస్‌రోడ్డు నుంచి నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి సర్కిల్, అయ్యప్పగుడి, బీవీ నగర్, అన్నమయ్య సర్కిల్, రామలింగాపురం, రైల్వే అండర్ బ్రిడ్జి, ఏసీ మార్కెట్ మీదుగా ఆర్టీసీ బస్టాండ్‌కు చేరుకోవాలి.
- జొన్నవాడ వైపు నుంచి వచ్చే బస్సులు పుత్తా ఎస్టేట్, సెయింట్ జోసెఫ్ స్కూల్ మీదుగా బోసుబొమ్మ, గాంధీ బొమ్మ, ఏసీ మార్కెట్ మీదుగా ఆర్టీసీకి చేరుకోవాల్సి ఉంది.
- బట్వాడిపాళెం నుంచి పోలీసు ఆఫీసు మీదుగా వెళ్లే వాహనాలను మూలాపేట మీదుగా దారి మళ్లించారు.
- కేవీఆర్ పెట్రోల్ బంకు నుంచి డీకేడబ్ల్యూ కళాశాల వైపు రాకపోకలను నిషేధించారు.
- ఈనెల 21వ తేదీ వరకు నెల్లూరు నగరంలోకి భారీ వాహనాల రాకపోకలను నిషేధించారు.
- పొదలకూరురోడ్డు సెంటర్, కేవీఆర్ పెట్రోల్ బంకు, బట్వాడిపాళెం జంక్షన్ తదితర ప్రాంతాల్లో బారికేడ్లను ఏర్పాటు చేశారు.



పొదలకూరు రోడ్డు సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన బారికేడ్లు

పరిసర ప్రాంతవాసులకు పాసుల్లేవు

దర్గా పరిసర ప్రాంతాల్లో నివసించే ప్రజలకు గతంలో పండగకు ముందుగానే అధికారులు పాసులు మంజూరు చేసేవారు. దీంతో ఆయా రోజుల్లో వారు వాటిని చూపించి రాకపోకలు సాగించేవారు. అయితే ఈసారి ఇంతవరకూ స్థానికులకు పాసులు మంజూరు చేయడంలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. బుధవారం ఉదయం 7 గంటల నుంచే ట్రాఫిక్ డైవర్షన్స్ అమల్లోకి వస్తాయని పోలీసు శాఖ ప్రకటించిన నేపథ్యంతో దర్గా పరిసర ప్రాంత ప్రజలు తమ అవసరాల నిమిత్తం బయటకు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోక తప్పదు. అధికారులు స్పందించి వారికి తక్షణమే పాసులు మంజూరు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పార్కింగ్ ప్రదేశాలివే..

- బెంగళూరు, చెన్నై, తిరుపతి వయా గూడూరు మీదుగా వచ్చే లారీలు, టెంపోలు, బస్సులు, కారులు, ఆటోలు, మినీ వ్యాన్ల కోసం ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం, జీజీహెచ్ (జిల్లా ప్రభుత్వ ప్రధానాస్పత్రి) ప్రాంగణంలో, డీ మార్ట్ సమీపంలోని సైన్స్ పార్కు వద్ద పార్కింగ్‌ను ఏర్పాటు చేశారు.
- విజయవాడ, గుంటూరు, ఒంగోలు, కావలి వైపు నుంచి వచ్చే లారీలు, టెంపోలు, బస్సుల కోసం ఎస్వీజీఎస్ కళాశాల గ్రౌండ్, కార్లు, ఆటోలు, మినీ వ్యాన్లు, టెంపోలకు వైఎంసీఏ గ్రౌండ్స్‌లో పార్కింగ్‌ను సిద్ధం చేశారు.
- అనంతపురం, కడప, బద్వేలు, ఆత్మకూరు వయా జొన్నవాడ నుంచి వచ్చే లారీలు, టెంపోలు, బస్సులకు డీఎస్ఎన్ మినీ ఫంక్షన్ హాల్ వెనుక, ఇరుకళల పరమేశ్వరి దేవస్థానం ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో, కార్లు, ఆటోలు, మినీవ్యాన్లకు కస్తూరిదేవి గార్డెన్స్ (కేవీఆర్ పెట్రోల్ బంకు సమీపంలో) వద్ద ఏర్పాటు చేశారు.
- కడప, రాజంపేట, రాపూరు, తిరుపతి, వెంకటగిరి వయా పొదలకూరు నుంచి వచ్చే లారీలు, టెంపోలు, బస్సులు తెలుగుగంగ దగ్గరలోని ఆలిండియా రేడియో స్టేషన్ ఎదురు ఖాళీ స్థలంలో, కార్లు, ఆటోలు, మినీవ్యాన్లకు పొదలకూరురోడ్డులోని జెడ్పీ బాలికల పాఠశాలలో పెట్టాలి.
- అధికారుల వాహనాలను సాల్వేషన్ ఆర్మీ చర్చి, జెడ్పీ ఆఫీసు ఆవరణ, వీఐపీ వెహికల్ పాసులున్న వాహనాలు పాత టీబీ హాస్పిటల్, డీకేడబ్ల్యూ కళాశాల ఆవరణలో పార్క్ చేయాలి.



కస్తూరిదేవి గార్డెన్ వద్ద పార్కింగ్ ప్లేస్

విద్యార్థులకు జెడ్పీ చైర్‌పర్సన్ పరామర్శ



విద్యార్థి ఆరోగ్యం గురించి తెలుసుకుంటున్న అరుణమ్మ

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నాయుడుపేట గురుకులంలో చదువుతున్న విద్యార్థులు కలుషిత ఆహారం తిని అనారోగ్యానికి గురైన విషయం తెలిసిందే. వారిని చికిత్స నిమిత్తం నెల్లూరు ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు. సమాచారం అందుకున్న జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ మంగళవారం వెంటనే ఆస్పత్రికి వెళ్లి 14 మంది విద్యార్థులను పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితి గురించి డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందజేయాలని సూచించారు. తల్లిదండ్రులకు ధైర్యం చెప్పారు.

- గురుకులాల్లో విద్యార్థులకు నాణ్యతతో కూడిన ఆహారాన్ని అందించేలా చర్యలు తీసుకోవాలని ఏపీ విద్యార్థి జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదిత్యసాయి డిమాండ్ చేశారు. విద్యార్థులను ఆయన పరామర్శించారు. ఉన్నతాధికారులు గురుకులాలను తనిఖీ చేసి నిర్లక్ష్యంగా ఉండే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బాలు, దినేష్, అబు తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో 128 మంది అగ్నిమాపక శాఖ సిబ్బంది

నెల్లూరు(క్రైమ్): రొట్టెల పండగ నేపథ్యంలో జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి వాకా శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షణలో ఏడీఎఫ్ఓ ఎస్.వేణుగోపాల్ చర్యలు చేపట్టారు. దర్గా లోపల, ఆవరణలోని దుకాణాల్లో ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా మంటలను ఆర్పే పరికరాలను ఏర్పాటు చేశారు. ప్రమాద సమయంలో వాటిని వినియోగించి మంటలను ఎలా అదుపు చేయొచ్చనే విషయాలపై దుకాణదారులకు అవగాహన కల్పించారు. స్వర్ణాల చెరువు ఘాట్‌ను ఎప్పటికప్పుడు శుభ్రం చేసేందుకు పంప్‌సెట్లను ఏర్పాటు చేశారు. రొట్టెల మార్పిడి సమయంలో ఎవరైనా ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోతే రక్షించేందుకు రెండు రెస్క్యూ బోట్లు, పదిమంది గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచారు. స్వర్ణాల చెరువు ఘాట్ వద్ద అగ్నిమాపక శాఖ అవుట్ పోస్టును ఏర్పాటు చేశారు. ఇక్కడ సిబ్బంది 24 గంటల పాటు అందుబాటులో ఉంటారు. నాలుగు అగ్నిమాపక శకటాలు (ఫైర్ ఇంజిన్లు), మిస్ట్ బుల్లెట్, పది పోర్టబుల్ పంప్ సెట్లు, రెండు ఐఆర్‌బీ బోట్లు, 40 అగ్నిమాపక పరికరాలు, 15 లైఫ్ జాకెట్లు, 15 రోప్స్ తదితరాలను అందుబాటులో ఉంచారు.

వివిధ జిల్లాల నుంచి..

నెల్లూరు జిల్లాతో పాటు, ప్రకాశం, అన్నమయ్య, బాపట్ల, గుంటూరు, తిరుపతి, వైఎస్సార్ జిల్లాలకు చెందిన అగ్నిమాపక సిబ్బంది బుధవారం నుంచి 21వ తేదీ వరకు దర్గాలో విధులు నిర్వహించనున్నారు. నెల్లూరు జిల్లా విపత్తు, స్పందన అధికారి, ఏడీఎఫ్ఓ, 14 మంది ఎస్ఎఫ్ఓలు, 28 మంది లీడింగ్ ఫైర్‌మెన్లు, 11 మంది డ్రైవర్లు, 49 మంది ఫైర్‌మెన్లు, 22 మంది హోంగార్డులు, ఒక జూనియర్ అసిస్టెంట్ మొత్తంగా 128 మంది విధుల్లో పాల్గొంటున్నారు. మంగళవారం దర్గా ఆవరణలోని అగ్నిమాపక శాఖ అవుట్ పోస్టు వద్ద వాకా శ్రీనివాసులురెడ్డి సిబ్బందితో సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. ఎలాంటి విపత్కర పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. అనంతరం ఆయన, ఏడీఎఫ్ఓలు దర్గా ఆవరణ, రొట్టెల మార్పిడి ప్రదేశాలను పరిశీలించారు.



సిబ్బందికి సూచనలిస్తున్న వాకా శ్రీనివాసులురెడ్డి

చెట్లు నరికి తరలిస్తుండగా..

- పట్టుకున్న అటవీ శాఖ అధికారులు

వరికుంటపాడు: మండలంలోని పెద్దిరెడ్డిపల్లె అటవీ ప్రాంతంలో అక్రమంగా చెట్లను నరికి తరలించేందుకు యత్నిస్తుండగా అటవీ శాఖ అధికారులు సోమవారం రాత్రి పట్టుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. అటవీ ప్రాంతం నుంచి సుమారు ఐదు టన్నుల కలప తరలిస్తున్నారని ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందింది. బీట్ సిబ్బంది దాడులు నిర్వహించి కలపను స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం రేంజ్ అధికారి తుమ్మల ఉమామహేశ్వరరెడ్డి సమగ్రంగా విచారించి కలప తరలించేందుకు యత్నించిన వ్యక్తికి రూ.43 వేల జరిమానా విధించారు. ఈ సందర్భంగా రేంజ్ అధికారి మాట్లాడుతూ అటవీ సంపదను ఎవరైనా అక్రమంగా తరలించినా, వన్యప్రాణులను వేటాడినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కోలార్‌లో వివాహిత ఆత్మహత్య

వరికుంటపాడు: మండలంలోని కనియంపాడుకు చెందిన జమీమా (27) అనే వివాహిత సోమవారం రాత్రి కర్ణాటక రాష్ట్రంలోని కోలార్‌లో ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి బంధువుల కథనం మేరకు.. కనియంపాడు చర్చిలో పాస్టర్‌గా ఉన్న నెల్లూరుకు చెందిన జాన్‌బాబు అనే వ్యక్తి కొండిపోగు జమీమా ప్రేమించుకున్నారు. ఈ ఏడాది మే 25వ తేదీన వారు నెల్లూరులో వివాహం చేసుకున్నారు. ఈ విషయాన్ని జమీమా తన కుటుంబసభ్యులకు చెప్పగా వారు పెళ్లిపై అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో అప్పట్లో పోలీసులను ఆశ్రయించారు. వారి ద్వారా జమీమాను తీసుకెళ్లిపోయారు. 27వ తేదీన కోలార్‌లోని బంధువుల వద్దకు పంపేశారు. ఈ క్రమంలో జాన్‌బాబు గత నెల 2వ తేదీన జిల్లాలోని కోడూరు బీచ్‌లో ఆత్మహత్య చేసుకున్నాడు. భర్త చనిపోయిన విషయాన్ని ఆలస్యంగా తెలుసుకున్న జమీమా మనస్తాపానికి గురై సూపర్ వాస్మోల్ తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు స్థానికులు చెబుతున్నారు.

రైల్లో నుంచి జారిపడి వ్యక్తి మృతి



వ్యక్తి మృతదేహం

నెల్లూరు(క్రైమ్): గుర్తుతెలియని వ్యక్తి ప్రమాదవశాత్తు రైల్లో నుంచి జారిపడి మృతిచెందాడు. ఈ ఘటన పెన్నా బ్రిడ్జి వద్ద కావలి వైపు వెళ్లే పట్టాలపై మంగళవారం జరిగింది. సమాచారం అందుకున్న నెల్లూరు రైల్వే ఎస్సై జి.మాలకొండయ్య ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడి వయస్సు 30 నుంచి 35 సంవత్సరాల మధ్య ఉంటుందని భావిస్తున్నారు. పసుపు రంగు హాఫ్ హ్యాండ్స్ చొక్కా, గ్రీన్ కలర్ లోయర్ ధరించి ఉన్నాడు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి ఎస్సై కేసు నమోదు చేశారు. ఆచూకీ తెలిసిన వారు నెల్లూరు రైల్వే పోలీసులను సంప్రదించాలని ఆయన కోరారు.

బైక్‌పై వెళ్తూ గేదెను ఢీకొని..

- అల్లూరు మండలంలో యువకుడి మృతి



జయపాల్ (ఫైల్)

అల్లూరు: మోటార్‌బైక్‌పై వెళ్తున్న ఓ యువకుడు గేదెను ఢీకొని మృతిచెందిన ఘటన అల్లూరు – నార్త్ మోపూర్ రోడ్డు మధ్య మంగళవారం తెల్లవారుజామున జరిగింది. అల్లూరు ఎస్సై పి.శ్రీనివాసులు రెడ్డి కథనం మేరకు.. నార్త్ మోపూర్ గ్రామానికి చెందిన నక్కా జయపాల్ (19) ఇంటర్మీడియట్ చదువుతున్నాడు. ఇతని తండ్రి చనిపోయాడు. తల్లి ప్రభావతి కూలీ పనులకు వెళ్తోంది. జయపాల్ మోటార్‌బైక్‌పై అల్లూరు గ్రామానికి వెళ్తున్నాడు. బయలుదేరిన ఐదు నిమిషాల్లోనే అల్లూరు – మోపూర్ రోడ్డు మధ్య గేదెను ఢీకొని కింద పడిపోయాడు. తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహానికి అల్లూరు ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం చేయించి కుటుంబసభ్యులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.